# నమస్తే తెలంగాణ
# పెద్దపల్లి
5 | కరీంనగర్, గురువారం 7 మార్చి 2024 | PEDDAPALLI


## రేవంత్‌ను చూస్తే ఊసరవెల్లి సిగ్గు పడుతది




ఎన్నికల హామీలను అమలుచేయకుండా రోజుకో తీరు మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డిని చూస్తే ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిన ఎల్‌ఆర్‌ఎస్‌పై గతంలో అనేక విమర్శలు చేసిండు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్‌ను పూర్తిగా ఉచితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చిండు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన పాలన చూస్తే నవ్వొస్తున్నది. కేసీఆర్, కేటీఆర్‌లు రేవంత్‌రెడ్డికి కలలో కూడా కనిపిస్తున్నరు. ఇచ్చిన మాటలు అమలుచేయడం మాని అబద్ధాలతో పాలన సాగిస్తుండు. ఎల్‌ఆర్‌ఎస్ పథకంలో వచ్చిన దరఖాస్తులను ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పరిష్కరించాల్సిన పనిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. చిత్తశుద్ధి, దమ్ము, ధైర్యం ఉంటే ఇచ్చిన వాగ్దానాలన్నీ అమలుచేయాలి. ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలుచేయకుంటే దరఖాస్తుదారులందరినీ తీసుకొచ్చి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం. సిరిసిల్లలో ఇటీవల జరిగిన పరిణామాలు చూసి భయపడిన రేవంత్‌రెడ్డి తన పర్యటన రద్దు చేసుకుని పారిపోయిండు.

**- కొండూరి రవీందర్‌రావు, నాఫ్స్‌కాబ్ చైర్మన్**




ఎస్సారార్ కళాశాల మైదానం



# కలిసొచ్చిన గడ్డపై నుంచే కదనభేరి

**ఈ నెల 12న కరీంనగర్‌లో లక్షమందితో బహిరంగ సభ**

- ఎస్సారార్ కళాశాల మైదానం నుంచే శంఖారావం
- రాబోయే పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం
- నేడు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాక
- లోక్‌సభ నియోజకవర్గ ముఖ్యనేతలతో సమావేశం
- బహిరంగ సభ స్థలం, ఏర్పాట్ల పరిశీలన

**లోక్‌సభ సమరానికి భారత రాష్ట్ర సమితి సన్నద్ధమైంది. గత జనవరిలో హైదరాబాద్‌లో నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించిన పార్టీ, క్షేత్రస్థాయిలో దిగేందుకు ముహూర్తం ఇప్పటికే ఖరారు చేసింది. అందులో భాగంగా కలిసొచ్చిన కరీంనగర్ గడ్డ నుంచే త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల శంఖారావం పూరించాలని నిర్ణయించింది. అందుకోసం ఈ నెల 12న కరీంనగర్ ఎస్సారార్ కళాశాల వేదికగా లక్ష మందితో భారీ బహిరంగ సభ నిర్వహించబోతున్నది. ఈ నేపథ్యంలో గురువారం సభ ఏర్పాట్లను పరిశీలించడంతోపాటు కరీంనగర్ లోక్‌సభ ముఖ్యనేతలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. జనసమీకరణ, కేసీఆర్ ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కాంగ్రెస్ చేస్తున్న కుట్రలు, కుతంత్రాలను తిప్పికొట్టేలా నాయకులకు దిశా నిర్దేశం చేయనున్నారు.**

కరీంనగర్, మార్చి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్‌లోని శ్రీ రాజరాజేశ్వర (ఎస్సారార్) కళాశాల మైదానం బీఆర్‌ఎస్‌కు అన్ని విధాలా కలిసివచ్చింది. 2001 మే 17న పార్టీ ఆవిర్భావం సందర్భంగా 'సింహగర్జన' పేరిట నిర్వహించిన సభ ఒక చరిత్ర సృష్టించింది. యావత్ తెలంగాణ ప్రజల్లో ఒక చైతన్యం రగిల్చింది. ప్రత్యేక రాష్ట్ర సాధనలో భాగంగా 2011 సెప్టెంబర్ 23న ఇక్కడ జరిగిన బహిరంగ సభా వేదిక నుంచే సకలజనుల చారిత్రక సమ్మెకు పిలుపునివ్వగా, అది చరిత్రలో నిలిచిపోయింది. 2014 ఏప్రిల్ 13న జరిగిన బహిరంగ సభ నుంచే సార్వత్రిక ఎన్నికలకు సమర శంఖం పూరించగా, పార్టీ అద్భుత విజయాన్ని అందుకున్నది. ఇప్పుడు రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్‌ఎస్, మరోసారి కలిసొచ్చిన ఎస్సారార్ కాలేజీ గ్రౌండ్ నుంచే శంఖారావం పూరించేందుకు సిద్ధమైంది. ఈ నెల 12న కదనభేరి పేరిట తొలి ప్రచార బహిరంగ సభను నిర్వహించబోతున్నది. ఈ విషయాన్ని ఇప్పటికే బహిర్గతం చేయగా, అందుకు సంబంధించిన ఏర్పాట్లపై నాయకత్వం దృష్టిపెట్టింది.

### బీఆర్‌ఎస్ వెంటే జనం

కరీంనగర్ లోక్‌సభ ప్రజలు ఆది నుంచీ బీఆర్‌ఎస్ వెంటే ఉంటున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలే అందుకు నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనూ కారుకే జైకొడుతారని చెబుతున్నారు. అయితే, అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో శ్రేణులు సమన్వయంతో పనిచేస్తే విజయం తథ్యమని అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. బోయినపల్లి వినోద్‌కుమార్ గెలుపు ఖాయమని జోస్యం చెబుతున్నారు. గతంలో ఎంపీగా ఆయన చేసిన అభివృద్ధే గెలిపిస్తుందని చెబుతున్నారు. నిజానికి 2014 నుంచి 2019 వరకు కరీంనగర్ ఎంపీగా పనిచేసిన వినోద్‌కుమార్, కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ ప్రతిష్టను నలుదిశలా ఇనుమడింప చేశారు. మేధావిగా, అవినీతి రహితుడుగా, సత్తా ఉన్న నాయకుడిగా పేరు సంపాదించారు. లోక్‌సభ సమావేశాల్లో తెలంగాణ గొంతుకను వినిపిస్తూనే.. నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఆనాడే చెరగని ముద్ర వేశారు. కొత్తపల్లి – మనోహరాబాద్ రైల్వేలైన్‌తోపాటు పలు రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయడంలో చొరవ చూపించారు. హైదరాబాద్ తర్వాత కరీంనగర్ గొప్పగా తీర్చిదిద్దాలన్న తపనతో జాతీయ రహదారులను సాధించడమే కాకుండా, కరీంనగర్ కేంద్రంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంలో విజయం సాధించారు. నిబంధనలు ఒప్పుకోకపోయినా కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ సాధించారు. విద్యారంగం అభివృద్ధి కోసం విశేష కృషి చేశారు. బీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ ఉప నాయకుడిగా సమర్థవంతంగా పని చేయడమే కాకుండా, ఐదేళ్లలో 540 ప్రశ్నలు సంధించిన ఎంపీగా చరిత్ర సృష్టించి దేశంలోనే రెండో స్థానంలో నిలిచారు. అలాగే, 106 అంశాలపై చర్చల్లో పాల్గొని అత్యధిక చర్చల్లో పాల్గొన్న ఎంపీగా రికార్డు నమోదు చేశారు. ఇలా అనేక విషయాలను పరిగణనలోకి తీసుకొని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా వినోద్‌కే పార్టీ అధిష్ఠానం అవకాశం ఇవ్వగా, లోక్‌సభ ప్రజలు కూడా స్వాగతిస్తున్నారు. విషయ పరిజ్ఞానం, తన ప్రాంతానికి మేలు చేయాలన్న తపన, సాధించే వరకు అలుపెరుగకుండా శ్రమించే నైజమున్న నాయకుడని కొనియాడుతున్నారు. 2014 నుంచి 2019 వరకు.. అలాగే 2019 నుంచి 2024 వరకు మధ్య కరీంనగర్ లోక్‌సభలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేస్తున్నారు. బండి సంజయ్ సాధించిందేమీ లేదని, పార్లమెంట్ సమావేశాల్లో ఆయన పాల్గొన్నది, ప్రశ్నించింది వేళ్లపై లెక్కించవచ్చని బీజేపీ శ్రేణులే చెబుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే.. వినోద్‌కు, సంజయ్‌కు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### అసెంబ్లీ ఎన్నికలే నిదర్శనం

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్నో అమలు కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకుందన్న విమర్శలున్నాయి. అంతే కాదు, వంద రోజుల్లో తాము ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని చెప్పిన ఆ పార్టీ, కేవలం మూడు నాలుగు హామీలు.. అది అనేక కోతలతో అమలు చేస్తున్నది. నిజానికి ఇవ్వాల్సింది కొండంత అయితే.. స్కీంలు పిసరంత కూడా అమలు చేయలేదు. కాగా, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ మూడింటిలో బీఆర్‌ఎస్, నాలుగింటిలో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. కానీ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో చూస్తే ఎక్కువ ఓట్లు బీఆర్‌ఎస్‌కే వచ్చాయి. మొత్తం 13,76,665 ఓట్లు పోలు కాగా, అందులో కాంగ్రెస్‌కు 5,12,352 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 5,17,601, బీజేపీకి 2,50,400 ఓట్లు వచ్చాయి. ఎక్కువ చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచినా.. ఓట్లు మాత్రం బీఆర్‌ఎస్‌కే అధికంగా రావడం చూస్తే ఈ లోక్‌సభ నియోజకవర్గంలో ప్రజలు బీఆర్‌ఎస్ వెంటే ఉన్నారని స్పష్టమవుతున్నది. అంతే కాదు, బీఆర్‌ఎస్ శ్రేణులు కలిసికట్టుగా పనిచేస్తే గెలుపు తథ్యమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటు ఇప్పటికే కాంగ్రెస్ తీరుపై ప్రజల్లో అసంతృప్తి కనిపిస్తున్నది. గడిచిన పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో సాగు, తాగునీటి కొదువ లేకపోగా, ప్రస్తుతం సాగు, తాగునీటికి కష్టాలు మొదలు కావడం, ఇప్పటికే వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోవడంతో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో అమలు కాని హామీలతో మభ్యపెట్టి ఓట్లు వేయించుకుందని విమర్శిస్తున్నారు. తాము ఇచ్చిన హామీలన్నింటినీ వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, కేవలం మూడు నాలుగు హామీలే.. అది కూడా అనేక కోతలతో అమలు చేస్తున్నదని మండిపడుతున్నారు. నిజానికి ఇవ్వాల్సింది చేంతాడంత అయితే.. పిసరంత స్కీంలు కూడా ఇవ్వలేదని చెబుతున్నారు.

**గత ఫిబ్రవరి 8న కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన వివరాల ప్రకారం ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న ఓటర్ల వివరాలు**

| నియోజకవర్గం పేరు | పురుషులు | మహిళలు | థర్డ్ జండర్ | మొత్తం ఓటర్లు |
|---|---|---|---|---|
| కరీంనగర్ | 1,81,093 | 1,81,388 | 43 | 3,62,524 |
| చొప్పదండి (ఎస్సీ) | 1,13,620 | 1,21,524 | 06 | 2,35,150 |
| మానకొండూరు(ఎస్సీ) | 1.09,947 | 1,14,902 | 01 | 2,24,850 |
| హుజూరాబాద్ | 1,21,294 | 1,27,967 | 07 | 2,49,268 |
| వేములవాడ | 1,07,788 | 1,17,508 | 32 | 2,25,323 |
| సిరిసిల్ల | 1,19,140 | 1,25,967 | 08 | 2,45,115 |
| హుస్నాబాద్ | 1,21,081 | 1,25,076 | 05 | 2,46,162 |
| మొత్తం | 8,73,958 | 914,332 | 102 | 17,88,392 |

**గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో పార్టీల వారీగా వచ్చిన ఓట్ల వివరాలు**

| నియోజకవర్గం పేరు | మొత్తం పోలైన ఓట్లు | కాంగ్రెస్ | బీఆర్‌ఎస్ | బీజేపీ |
|---|---|---|---|---|
| కరీంనగర్ | 2,29,774 | 40,057 | 92,179 | 89,016 |
| చొప్పదండి | 1,82,168 | 90,395 | 52,956 | 26,669 |
| మానకొండూరు | 1,85,829 | 96,773 | 64,408 | 14.879 |
| హుజూరాబాద్ | 2,09,311 | 53,164 | 80,333 | 63,460 |
| సిరిసిల్ల | 1,88,740 | 59,557 | 89,244 | 18,328 |
| వేములవాడ | 1,74,145 | 71,451 | 56,870 | 29,710 |
| హుస్నాబాద్ | 2,06,698 | 1,00,955 | 81,611 | 8,338 |
| మొత్తం | 13,76,665 | 5,12,352 | 5,17,601 | 2,50,400 |







సిరిసిల్ల: ఆర్డీవో కార్యాలయం వద్ద మహాధర్నాలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు చక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, నాయకులు

# ఎల్ ఆర్ఎస్‌పై ఇంత దగానా..?



చొప్పదండి: ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నాయకులు

- నాడు ఉచితమని నేడు ఫీజులా..?
- ఎన్నికల ముందో మాట.. ఇప్పుడు మరో మాటనా..?
- కాంగ్రెస్ తీరుపై భగ్గుమన్న బీఆర్‌ఎస్
- వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో పోరుబాట
- ఉమ్మడి జిల్లాలో పెద్ద ఎత్తున ధర్నాలు
- అధికారులకు వినతిపత్రాలు
- 'షేమ్ షేమ్ కాంగ్రెస్' అంటూ నినాదాలు

**'ఎల్ ఎర్ఎస్‌పై ఇంత దగానా..? నాడు ఉచితమని నేడు ఫీజు అంటరా..? నమ్మి ఓటేస్తే ఇంత మోసమా..? ఇంత ద్రోహమా..?' అంటూ బీఆర్‌ఎస్ నాయకులు ధ్వజమెత్తారు. 'ఏరు దాటేదాక ఓడ మల్లన్న.. ఏరు దాటినంక బోడ మల్లన్న' అన్నట్టుగా కాంగ్రెస్ వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఆ పార్టీ ఇచ్చిన హామీ మేరకు లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీంను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఉమ్మడి జిల్లాలోని నగరాలు, పట్టణాలు, నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు చేశారు. మాట తప్పిన కాంగ్రెస్ తీరును ఎండగట్టారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్ ఆర్ఎస్ ఫ్రీ అని చెప్పి ఇప్పుడిలా మాట దాటేయడం సరికాదని, ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని హితవు పలికారు.**

### ఆందోళన ఉధృతం చేస్తాం

కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆపార్టీ నేతలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, భట్టి విక్రమార్క ఎల్‌ఆర్‌ఎస్ డబ్బులు కట్టవద్దని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉచితంగా ఎల్‌అర్‌ఎస్ అమలు చేస్తామని చెప్పారు. కానీ, కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిందే తప్ప ప్రజలకు సేవచేయడానికి కాదు. ఇప్పుడు ఎల్‌అర్‌ఎస్ దరఖాస్తుదారుల నుంచి వేలకోట్లు వసూలు చేసేందుకు సిద్ధమైంది. ఇచ్చిన హామీ మేరకు ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా చేపట్టకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం.

**- మానకొండూర్‌లో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్**

పెద్దపల్లి/ మంథని/ కోల్‌సిటీ, మార్చి 6 : లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్)పై ఫీజు వసూలును నిరసిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు పోరుబాట పట్టారు. ఎన్నికల ముందు ఫ్రీగా ఇస్తామన్న కాంగ్రెస్.. అధికారంలోకి రాగానే మాట తప్పి ఫీజులు వసూలు చేయడమేంటని మండిపడ్డారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీలతోపాటు నియోజకవర్గ కేంద్రాల్లో పెద్ద ఎత్తున ధర్నాలు చేశారు. సిరిసిల్లలో వందలాది మందితో మహాధర్నా చేయగా, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరుట్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట నాయకులతో కలిసి ధర్నా చేసి, అనంతరం పట్టణ కమిషనర్ తిరుపతికి వినతి పత్రం అందజేశారు. మానకొండూర్‌లో పల్లెమీద చౌరస్తా వద్ద మాజీ ఎమ్మెలేయ రసమయి బాలకిషన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, రాష్ట్ర నాయకులు గడ్డం నాగరాజు, అనిల్ కూర్మాచలం, జడ్పీటీసీలు తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ధర్నా చేశారు. చొప్పదండిలోని తెలంగాణ చౌరస్తా వద్ద నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధర్నా చేశారు. దాదాపు అన్ని చోట్లా రహదారులపై బైఠాయించి నిరసన తెలిపారు. అంతటా కాంగ్రెస్ సర్కారుకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 25 లక్షల మంది నుంచి దాదాపు రూ.20 వేల కోట్లు దండుకోవాలని చూస్తున్నదని ధ్వజమెత్తారు. నాడు ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని సూచించారు. అనంతరం ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

### ఎల్ ఆర్ఎస్ ఫీజు ఎవరూ కట్టొద్దు

ఎల్‌ఆర్‌ఎస్ డబ్బులు కట్టవద్దని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉచితంగా అమలు చేస్తామని ఎన్నికలకు ముందు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క చెప్పారు. వాటిని మరిచి ఇప్పుడు డబ్బులు వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. కోరుట్లలో 10 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎల్‌ఆర్‌ఎస్ ఎవరూ కట్టవద్దు. మీ కోసం నేను పోరాడుతా. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి.

**- కోరుట్ల, మెట్‌పల్లిలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల**



మానకొండూర్: ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి, చిత్రంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, నాయకులు




కోరుట్ల : మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

# కష్టపడి పనిచేస్తే బీఆర్‌ఎస్‌దే విజయం




మాట్లాడుతున్న కరీంనగర్ బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్

- బీజేపీ వైఫల్యాలను ఎండగట్టాలి
- ఐదేళ్లలో బండి సంజయ్ చేసిందేమీ లేదు
- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేసేదాకా పోరాడాలి
- 12న కేసీఆర్ సభను విజయవంతం చేయాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్
- మధురానగర్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం

గంగాధర, మార్చి 6 : ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేస్తే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఈ నెల 12న కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ సభ సందర్భంగా బుధవారం మండలంలోని మధురానగర్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసే వరకు వదిలేది లేదన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని గుజరాత్ మోడల్ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. కరీంనగర్ ఎంపీగా ఐదేళ్లలో బండి సంజయ్ చేసిందేమీ లేదని, గ్రామాల్లో చర్చపెట్టి కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను ఎండగట్టాలని కార్యకర్తలకు సూచించారు. కాళేశ్వరం నీళ్లు ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కారు రైతులకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ప్రజలు ఆశీర్వదించి పార్లమెంట్‌కి పంపిస్తే ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకవుతానన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగితే వెంటనే కాఫర్ డ్యాం నిర్మించకుండా సర్కారు నిర్లక్ష్యం చేయడంతో ఐదు వేల క్యూసెక్కుల నీరు సముద్రంలో కలుస్తోందని, ఫలితంగా చెరువులు, కుంటలు అడుగంటి ప్రస్తుత యాసంగి పంటలన్నీ ఎండిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



విద్యుత్ వెలుగులతో కాంతులీనుతున్న రాజన్న ఆలయం

# శివరాత్రికి ముస్తాబు

- రాజన్న సన్నిధిలో సర్వం సిద్ధం
- మూడు రోజుల పాటు ఉత్సవాలు
- సుమారు 4 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం

వేములవాడ టౌన్,మార్చి 6: మహాశివరాత్రికి వేములవాడ రాజన్న ఆలయం ముస్తాబైంది. గురువారం నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు సిద్ధమైంది. కోల్‌కతా డెకరేషన్‌తో రూపుదిద్దుకున్న ఆవరణ సరికొత్తగా కనిపిస్తున్నది. ఆలయ గోపురం విద్యుద్దీపాలంకరణలో దేదీప్యమానంగా మెరిసిపోతున్నది. రంగురంగుల దీపాలతో కూడిన శివపార్వతుల కటౌట్లు, స్వాగత తోరణాలతో ప్రాంగణమంతా జిగేల్‌మంటున్నది. రాష్ట్రం నలుమూలల సుమారు 4లక్షల మంది భక్తులు తరలిరానుండగా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. గురువారం రాత్రి 7 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.